సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం

- జీవన ప్రమాణాల మెరుగు
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 86వ వార్డులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ప్రజలకు అభివాదం చేస్తున్న అమర్‌నాథ్



86వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి, వారి జీవన ప్రమాణాల మెరుగుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ప్రజలకు పాలనను చేరువ చేయడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన ఘనత మన సీఎంకే చెందుతుందన్నారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధి పాత కూర్మన్నపాలెంలో అమర్‌నాథ్ సోమవారం ప్రచారం చేశారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలను, వృద్ధులను ఆత్మీయంగా పలకరించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వీవీఎస్ఎం రాజా, వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, నాయకులు చేగొండి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ రామచంద్రరాజు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మలమ్మ, మాటూరి శ్రీనివాసరావు, భూపతిరాజు శ్రీనివాసరాజు, చట్టి దేముడు, పరదేశి, మాలయ్య, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందిస్తున్న అమర్‌నాథ్, చిత్రంలో దామా సుబ్బారావు



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించండి: మహిళను ఓటు అభ్యర్థిస్తున్న అమర్‌నాథ్



అమ్మా ఆశీర్వదించండి : వృద్ధురాలి దీవెనలు తీసుకుంటున్న అమర్‌నాథ్

గాజువాక బరిలో 14 మంది..

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల ప్రకటన

గాజువాక : సార్వత్రిక ఎన్నికల బరిలో గాజువాక నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వారం రోజుల పాటు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వివిధ పార్టీలకు డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారితో పాటు నామినేషన్ల పత్రాలపై సరైన అటెస్టేషన్లు లేని కారణంగా ఐదు నామినేషన్లను తిరస్కరించడంతో బరిలో 16 మంది మిగిలారు. వారిలో జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పల్లి శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గవర రోహిణి కుమారి తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడంతో పోటీలో 14 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి ప్రకటించారు. వారికి వివిధ గుర్తులను కేటాయించారు.

క్రమ సంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
1.	అమర్‌నాథ్ గుడివాడ	వైఎస్సార్‌సీపీ	ఫ్యాన్
2.	జగ్గునాయుడు మరడాన	సీపీఎం	సుత్తి కొడవలి నక్షత్రం
3 .	నందికోళ్ల అప్పారావు	బహుజన్ సమాజ్ పార్టీ	ఏనుగు
4.	పల్లా శ్రీనివాసరావు	తెలుగుదేశం	సైకిల్
5.	ఆదినారాయణ.కె (ఆదిబాబు)	జై మహాభారత్ పార్టీ	ఫ్లూట్
6.	తలుపుల శైలజ	ప్రజా ప్రస్థానం పార్టీ	బోట్‌మేన్ సైల్
7.	తోట అక్కయ్య	లోక్ తాంత్రిక్ పార్టీ	ఆటో రిక్షా
8.	కె.ఏ.పాల్	ప్రజాశాంతి పార్టీ	కుండ
9.	బత్తుల నీలకంఠం	నవభారత నిర్మాణ సేవా పార్టీ	టీవీ
10.	శ్యాముల్ జాన్ ధర్మరాజు రాయపాటి	దళిత బహుజన పార్టీ	గ్యాస్ సిలిండర్
11.	నుంకసురి సార జ్యోతి	నవతరం పార్టీ	బకెట్
12.	కాకర్లమూడి కృష్ణ ప్రదీప్	ఇండిపెండెంట్	గ్లాసు
13.	కొవిరి కృష్ణ	ఇండిపెండెంట్	బ్యాట్
14.	ఎస్.శ్రీనివాసరావు @ భగవాన్ శ్రీను	ఇండిపెండెంట్	టీవీ రిమోట్

ఉక్కు పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధం

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1173వ రోజు, సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే వెంటనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మంత్రి, పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రంబ నారాయణమూర్తి, తాటికొండ జగదీష్, చిరంజీవి, బలగా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ కోసం గంగవరం పోర్టు కార్మికుల వినతి



లేబర్ కమిషనర్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద రూ.35లక్షలు ఇవ్వాలని నిర్వాసిత కార్మికుల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నగరంలోని అక్కయ్యపాలెంలో గల లేబర్ కమిషనర్ కార్యాలయంలో మేనేజర్ గణేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. నెల రోజుల్లోగా తమకు వన్ టైం సెటిల్‌మెంట్ చేయాలని, కార్మికులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

అక్కిరెడ్డిపాలెం: ట్రాన్సిట్ మిక్సర్ (కాంక్రీట్ రెడీ మిక్స్) లారీ డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని గాజువాక ట్రాఫిక్ సీఐ పి.కోటేశ్వరరావు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ట్రాన్సిల్ మిక్సర్ లారీ యజమానులకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ లారీలు పీక్ టైమ్‌లో రోడ్లపై తిరగరాదన్నారు. లోడుతో వెళ్తున్న లారీ నుంచి కాంక్రీట్ మిక్సర్ రోడ్డుపై జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లారీలను రోడ్ల పక్కన పార్క్ చేయకూడదన్నారు.

'ఇండియా కూటమిని గెలిపించండి'



ఐక్యత చాటుతున్న నాయకులు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ వర్కర్స్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి, గాజువాక సీపీఎం అభ్యర్థి జగ్గునాయుడు, అనకాపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్, పెందుర్తి కాంగ్రెస్ అభ్యర్థి భగత్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రామకృష్ణ ప్రసంగించారు. ఆదినారాయణ, వై.టి.దాస్, రామారావు, సన్యాసిరావు, ప్రకాశ్,పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ నీటి సరఫరా విభాగం అధికారులు పోర్టు వై జంక్షన్ వద్ద ప్రధాన నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. 64వ వార్డు వెంకన్నపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, గొడ్డువానిపాలెం, అశోక్‌నగర్, 65వ వార్డులో వికాస్‌నగర్, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, భానోజీతోట, ప్రియదర్శిని కాలనీ, 70వ వార్డులో శ్రామికనగర్, చట్టివానిపాలెం, దళమికొండ, 71వ వార్డులో కుంచుమాంబ కాలనీ, దత్తసాయినగర్, దిబ్బపాలెం ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. 72వ వార్డులో చినగంట్యాడ, చైతన్యనగర్, మోహన్‌నగర్, 73వ వార్డులో గొంతినవానిపాలెం, 74వ వార్డులో దయాల్‌నగర్, పైడిమాంబ కాలనీ, అంబేద్కర్ నగర్, టీజీఆర్ నగర్, నెహ్రూ నగర్, వియ్యపువానిపాలెం, 75వ వార్డు పరిధి పెదగంట్యాడ, దుర్గవానిపాలెం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, సిద్దేశ్వరం, 76వ వార్డులో నడుపూరు, హెచ్‌బీ కాలనీ, డెయిరీ కాలనీ, రిక్షా కాలనీ, గాంధీనగర్, రామచంద్రనగర్ ప్రాంతాల్లోనూ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అత్యవసర ప్రదేశాలలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు రేపు సమావేశం

గాజువాక : గాజువాక నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు చేసిన ఖర్చుల పరిశీలనకు బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్వో డి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సమావేశం జ్ఞానాపురంలోని జీవీఎంసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు గానీ, వారి ఏజెంట్లు గాని నామినేషన్ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు తమ అకౌంట్ రిజిస్టర్లలో ఖర్చులను నమోదు చేసి సంబంధిత రసీదులు, ఓచర్లు, ఎన్నికల నిమిత్తం ప్రారంభించిన బ్యాంకు ఖాతా పాస్ పుస్తకంతో హాజరు కావాలని కోరారు.

ప్రచార పర్వం



85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శ్రీమతి హిమగౌరి - అగనంపూడి



87వ వార్డు వడ్లపూడిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ - కూర్మన్నపాలెం



65వ వార్డు భవానీనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథం, నాగిశెట్టి శ్రీను - పెదగంట్యాడ



87వ వార్డు కణితి ఆర్‌హెచ్ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు - కూర్మన్నపాలెం



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో వైఎస్సార్‌సీపీ 78వ వార్డు ఇన్‌చార్జ్ రావాడ శివ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న నాయకులు - ఉక్కునగరం



72వ వార్డు వుడా కాలనీలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, అండిబోయిన లక్ష్మితో కలిసి ప్రచారం చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ - గాజువాక



68వ వార్డు చిన్న అక్కిరెడ్డిపాలెంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు - అక్కిరెడ్డిపాలెం



వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలను గెలిపించాలని కోరుతూ 67వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వార్డు ఇన్‌చార్జి పల్లా చినతల్లి, నాయకులు అచ్చెంనాయుడు, పల్లా పెంటారావు - గాజువాక

ప్రకటన

గాజువాక అసెంబ్లీ నియోజక వర్గమునకు సంబందించి శ్రీ సీతారాం జాట్, ఐ.ఏ.ఎస్. వారిని భారత ఎన్నికల సంఘం ఎన్నికల పరిశీలకులుగా నియమించింది. ఎన్నికల నిర్వహణకు సంబందించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నచో, వాటిని ప్రజలు కాని లేదా అభ్యర్థులు కాని లేదా రాజకీయ పార్టీ ప్రతినిధులు కాని పై ఎన్నికల పరిశీలకులను వారి సెల్ నెం. 6300320829 ద్వారా సంప్రదించవచ్చును.

రిటర్నింగ్ అధికారి,
నెం. 25 గాజువాక అసెంబ్లి నియోజకవర్గము

మే 2న దళితుల ఆత్మీయ సదస్సు




సంఘీభావం తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

పెదగంట్యాడ: వచ్చే నెల 2న పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించనున్న దళితుల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బహిరంగ సభకు ఎస్సీ, ఎస్టీ సోదరులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవిందరాజు, వెంకటేష్, సంపూర్ణం, హేమీమా, కల్పన, శ్రీదేవి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సు విజయవంతం చేయాలి

కూర్మన్నపాలెం: పెదగంట్యాడలో మే 2న నిర్వహించనున్న దళితుల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మార్టుపూడి పరదేశి కోరారు. కూర్మన్నపాలెం వుడా ఫేజ్-1లోని ఫంక్షన్ హాల్లో మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షతన 79, 85, 86, 87, 88, 89 వార్డుల్లోని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పరదేశి మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం కృషి చేసిన వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపించుకుందామన్నారు. సదస్సుకు హాజరై సంఘీభావం తెలియజేద్దామన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి పెంటయ్య, గాలి ఆనంద్ వై.మస్తానప్ప, సత్తిబాబు, కొల్లి దేముడు, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెంటమాంబ అనుపు ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, అమర్‌నాథ్ మాతృమూర్తి నాగమణి



అనుపు మహోత్సవంలో బల్ల వేషాలు

పెదగంట్యాడ: నెల్లిముక్కు 14 గ్రామాల ఆరాధ్యదేవత పెంటమాంబ అమ్మవారి పండగను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో బండ్ల వేషాలు, తప్పెటగుళ్ళు, నేలగరిడీలు, విచిత్ర వేషధారణలు అలరించాయి. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మహేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.